ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 10 అక్టోబరు , 2025 | పేజీలు : 06



వివరాలు మెయిన్‌లో

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

# ప్రజల కోసం సిపిఐ ఉద్యమాలు

## సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగిన నిత్యం ప్రజల కోసం పోరాటాలు ఉద్యమాలు నిర్వహించే ప్రజల గొంతుకగా నిలుస్తున్న సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం ఉప్పల ముత్యాలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నుండి కాంగ్రెస్తో ఈ రాష్ట్రంలో అవగాహనతో ఉన్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా కలిసి పనిచేయడానికి సిపిఐ సిద్ధంగా ఉందన్నారు. సిపిఐకి బలం ఉన్న చోట్ల జడ్పీటీసీ లుగా, ఎంపీటీసీలుగా, సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా పోటీ చేసే స్థానాలకు సీట్ల సర్దుబాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాంగ్రెస్తో పాటు సిపిఎం ఇతర వామ పక్ష పార్టీలతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్తామని ఆయన అన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ పై జరిగిన దాడి ప్రజాస్వామ్య పునాదులపై జరిగిన దాడి అని, ఈ దాడిని భారతీయ సమాజం ముక్తకంఠంతో కండించాలని కోరారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేశ న్యాయవ్యవస్థకు ప్రతీక అని, ఆయనపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్య పునాదులపై దాడి చేయడమేనని అన్నారు. దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడ చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, కల్లెం కృష్ణ, ఎండి.ఇమ్రాన్, చెక్క వెంకటేష్, ఏశాల అశోక్, చిగుర్ల లింగం పెరబోయిన మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల్లో పోటీకి సన్నద్ధమవ్వాలి
## పల్లా నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/డిండి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శాఖలు బలంగా ఉన్నటువంటి గ్రామాల్లో, గెలిచే స్థానాల్లో పోటీకి సిపిఐ శ్రేణులు సన్నద్ధమవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి అన్నారు. గురువారం సిపిఐ ప్రజాభవన్‌లో నిర్వహించిన డిండి మండల సిపిఐ కార్యవర్గ అత్యవసర సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి హాజరైనారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు ప్రస్తుతం బిసి రిజర్వేషన్ లు 42 అమలు చేయాలనే అంశం కోర్టు పరిధిలో ఉండగా మళ్ళీ నాలుగు వారాలకు వాయి దా వేసినందున ఎన్నికలు ఎప్పుడొచ్చినా శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపి ఐ జిల్లా కౌన్సిల్ బొడ్డుపల్లి వెంకటరమణ, మండ ల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు బొల్లె శైలేష్, తిప్పర్తి విజేందర్ రెడ్డి,కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి రవీంద్ర శర్మ,నూనె వెంకటేశ్వర్లు,ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.





## ఎసిబి వలలో చిట్యాల తహసీల్దార్
### రూ 2 లక్షల లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ క్రిష్ణ

**ప్రజాపక్షం/చిట్యాల** : వ్యవసాయ భూమిని మ్యూటేన్, ఇన్స్పెక్షన్ చేయడానికి పది లక్షలు డిమాండ్ చేసిన తహసీల్దార్.. 5లక్షలకు బేరం కుదుర్చుకుని రూ. 2లక్షలు కంప్యూటర్ ఆపరేటర్ రమేష్ ద్వారా తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నారు. మహబూబ్‌నగర్ డిఎస్‌పి, నల్లగొండ ఇంచార్జ్ సిహెచ్ బాలకృష్ణ వివరాలు వెల్లడించారు. చిట్యాల తహశీల్దార్ గుగులోతు కృష్ణ పై మండల పరిధిలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఎంఎస్ రతన్ హౌసింగ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబందించిన వ్యవసాయ భూమి సర్వేనెంబర్ 172లో ముటేషన్ చెయ్యడానికి సర్వే నెంబర్ 167 ఇన్‌స్పెక్షన్ చెయ్యడానికి 10 లక్షల డిమాండ్ చేయగా బాధితుడు ఎసిబిని ఆశ్రయించాడు. తహసీల్దార్ కార్యాలయంలో వ్యూహం ప్రకారం మాటువేసిన ఎసిబి అధికారులు గురువారం తహసీల్దార్ గుగులోత్ కృష్ణా, మరో ప్రైవేట్ వ్యక్తి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నాంపల్లి ఎసిబి కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన




**ప్రజాపక్షం/కోదాడ** :ప్రతి విద్యార్థి సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యాక్షులు ఉయ్యాల నర్సయ్య అన్నారు. గురువారం కోదాడ పట్టణ పరిధి బాలాజీనగర్ కె.ఆర్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ చట్టంతో అధికారులకు బాద్యత పెరుగుతుంది, ప్రజలకు ప్రభుత్వ, అధికారుల పనితీరు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని, చట్టం ప్రతి పౌరుడి హక్కు అన్నారు. ప్రిన్సిపాల్ రమాణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బైకును ఢీ కొట్టిన కారు : వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/కోదాడ:** బైకు కారు వేగంగా ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చిలుకూరు మండల పరిధి కవితా కళాశాల వద్ద కోదాడ, హుజూర్‌నగర్ ప్రదాన రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ వైపు నుండి హుజూర్‌నగర్ వెపు వెళ్లుతున్న కారు ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తుండగా చిలుకూరు నుండి కోదాడకు వస్తున్న బేతవోలు గ్రామానికి చెందిన ఎస్‌కె మదర్ సాహెబ్(30) బైకును వేగంగా ఢీ కొనడంతో తీవ్రగాయాలై అక్కడిక్కక్కడే మృతి చెందిన్నట్లు తెలిపారు. పోలీసులు మృత దేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## నామినేషన్ల స్వీకరణకు నిబంధనలను పాటించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లాలో మొదటి విడత ఎంపిటిసి,జెడ్‌పిటిసి ఎన్నికల నామినేషన్ల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి ఎంపీటీసీ, జడ్పిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా సాధారణ పరిశీలకురాలుగా రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్,అధికారి, కొర్ర లక్ష్మిని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించింది.ఈ మేరకు గురువారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి తో సమావేశమై మొదటి విడత ఎన్నికలు జరగనున్న ఎంపిటిసి, జెడ్‌పిటిసి స్థానాల నామినేషన్ల నోటిఫికేషన్, నామినేషన్ల ఏర్పాట్లపై చర్చించారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసి,గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కగా అమలు చేసేందుకు తీసుకున్న చర్యలు, పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పన, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో మొదటి విడతున నల్లగొండ, దేవరకొండ డివిజన్లలోని 18 మండలాలు, 196 ఎంపిటిసి, స్థానాలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, నోటిఫికేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని, నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నామినేషన్ల సందర్భంగా పాటించవలసిన నియమ, నిబంధనలను ఇదివరకే రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఇన్చార్జి డిఆర్‌ఓ,ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడి,స్థానిక సంస్థల ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి రాజ్ కుమార్, జడ్‌పి సీఈవో శ్రీనివాసరావు, డిపిఓ వెంకయ్య, పరిశీలకుల నోడల్ ఆఫీసర్ పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ రమేష్ ఉన్నారు.





## రాహుల్‌గాంధీ పంపిన సంతాప లేఖ

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణం పట్ల తన ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ పంపిన సంతాప సందేశాన్ని వారి కుమారుడు ఏఐసిసి సభ్యులు సర్వోత్తమ్ రెడ్డికి గురువారం తుంగతుర్తిలోని ఆయన నివాసంలో ఏఐసిసి ప్రతినిధి గంపా వేణుగోపాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చకిలం రాజేశ్వరరావు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## దశదిన కర్మకు అధిక సంఖ్యలో తరలిరావాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** ఈనెల 12న తుంగతుర్తి మండల కేంద్రంలో జరిగే మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభ, దశదిన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు తరలిరావాలని దామోదర్ రెడ్డి తనయుడు, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కోరారు. గురువారం దామోదర్ రెడ్డి మరణించి తొమ్మిదవ రోజు సందర్భంగా ఆయనకు నివాళులర్పించి మాట్లాడారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో ఉండి ఐదు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా ప్రజాసేవలో కొనసాగి అందరికి అందనంత దూరంలో దివికెగిసిన తన తండ్రి దామోదర్ రెడ్డి ఆత్మశాంతి చేకూర్చే విధంగా అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## హెచ్ఐవిపై అవగాహన

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని మునిపంపుల జడ్పిహైస్కూల్‌లో గురువారం 8,9,10 తరగతి విద్యార్థులకు హెచ్ఐవీపై ఎన్‌జీవో వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ స్కీం కార్యకర్త మేడి ముంకుందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దొడ్డి స్వామి మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ వల్ల జరిగే పరిమాణాలను తెలిపి, కౌమార దశలోని విద్యార్థులు సమాజంలో జరిగే వివిధ అంశాలపై తొందరపడి తమ భావి జీవితాలను ప్రమాదంలో పడవేసుకోవద్దన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మంజుల, త్రివేణి, ప్రసాద్, రేవతి, మంజుల, సరోజ, పాల్వంచ హరికిషన్, శ్రీశైలం, సునీత, నాగలక్ష్మి, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో లిటిల్ ఫ్లవర్ విద్యార్థి ఎంపిక

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల ౬న మిర్యాలగూడ ఎన్ఎస్పీ క్యాంప్‌లోని ఇండోర్ స్టేడియంలో బాక్సింగ్ కోచ్ రవీందర్ ఆధ్వర్యంలో నేషనల్ స్కూల్ గేమ్స్ పర్యవేక్షణలో జరిగిన అండర్ 17 బాక్సింగ్ జిల్లా స్థాయి పోటీల్లో పట్టణంలోని హౌజింగ్ బోర్డులోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థి పల్లపు నవదీప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కెకె.జయరాజన్ తెలిపారు. గురువారం ప్రతిభ చాటిన నవదీప్‌ను పాఠశాలలో ఆయన అభినందించి మాట్లాడారు. నవదీప్ భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించి వారు



ఉన్నత స్థానాలకు చేరుకునేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జిన్సీ జయరాజన్, హెచ్ఎం సుజయ్‌కుమార్, పీఈటీలు నీలం రమేష్, ఎం.శివశంకర్ తదితరులు ఉన్నారు.

# మాస్టర్ మైండ్ స్కూల్‌ని రీ ఓపెన్ చేయాలి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా కేంద్రంలోని ద మాస్టర్ మైండ్ హై స్కూల్ లో గత కొన్ని రోజుల క్రితం స్కూల్ బస్సు కింద పడి చిన్నారి చనిపోవడంతో విద్యా శాఖ అధికారులు స్కూలు సీజ్ చేయడంతో తమ పిల్లల చదువులు మధ్యలోనే ఆగిపోయిందని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ యాజమాన్యం వెంటనే స్కూల్ ను నడిపించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం ద మాస్టర్ మైండ్ హై స్కూల్ వద్ద స్కూల్ పిల్లలు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు స్కూలు సీజ్ చేయడంతో తమ పిల్లలను వేరే పాఠశాలలో చేర్పించే ప్రయత్నం చేసినా కూడా ఈ విద్య సంవత్సరం ముగింపు దశలో ఉండడంతో ఏ పాఠశాలలో చేర్పించుకోవటం లేదని తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేశారు.తమ పిల్లలకు మాస్టర్ మైండ్ స్కూల్ దిక్కు తప్ప మరొకటి లేదని స్కూల్ యాజమాన్యం మా పిల్లల భవిష్యత్తును కాపాడాలని వారు కోరారు.కోర్టు నుంచి స్కూల్ ని ఓపెన్ చేసుకోవచ్చు అని ఆదేశాలు ఉన్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్కూల్ యాజమాన్యం చెబుతున్నారని స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి మాస్టర్ మైండ్ స్కూల్ ని రీ ఓపెన్ చేసి పిల్లల భవిష్యత్తు కాపాడాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం

**ప్రజాపక్షం/డిండి:** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గురువారం పోషణ మాసం కార్యక్రమం మండలంలోని పెద్ద తండా అంగన్వాడి కేంద్రంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిడిపిఓ చంద్రకళ హాజరై బాలింతలకు, చిన్నారులకు,గర్భిణీ )లకు పోషక విలువలతో కూడిన ఆహారంతో కలిగే లాభాలను వివరించారు.పరిశుభ్రత,చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, కూరగాయలపై అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్ ను తినవద్దని పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.అంగన్వాడీల్లో గర్భిణీలకు బాలింతలకు చిన్నారులకు బలవర్ధక ఆహారాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు అన్నప్రా



సన,అక్షరాభ్యాసం చేశారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కే. రమణ,అంగన్వాడి టీచర్లు శోభ,పద్మ ఆయాలు కమ్లి, సైదా,ఏఎన్ఎం నికత్,చిట్టి ఆశాలు సరస్వతి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి

**ప్రజాపక్షం/చండూరు:** త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ కి చెందిన అభ్యర్థులను గెలిపించాలని బిఆర్ఎస్ చండూరు మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు కొత్త పాటి సతీష్ ప్రజలను కోరారు. గురువారం ఆయన చం దూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గంలోని ఏడు జడ్‌పిటిసిలు తో పాటు అన్ని మండలాలలో అత్యధిక స్థానాలలో బిఆర్ఎస్ కు చెందిన ఎంపిటిసిలను గెలిపించాలని అన్నారు. తెలంగాణలో కెసిఆర్ నాయకత్వంలోని బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే నేటికి కనిపిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో అన్ని వర్గాల ప్రజలు , కర్షకులు ,కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. గ్రామాలలో అభివృద్ధి జరగాలంటే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక స్థానాలలో గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు.

## కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అమలు చేయలేని హామీలతో గద్దెనెక్కి ప్రజాపాలన పేరుతో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగడుతూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రూపొందించి ఇటీవల మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ప్రారంభించిన కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ సూర్యాపేటలో జోరుగా కొనసాగుతుంది. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 27వ వార్డులో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి బాకీ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అన్ని రంగాల ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా తమకు వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నిమ్మల స్రవంతి శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు నల్లపాటి అప్పారావు, రేపల్లె ఉపేందర్, లతీఫ్, వట్టే లింగరాజు, వెంపటి శ్రీనివాస్, నాగరాజు, సుదర్శన్, సఫియా, ఆయూబ్ పాల్గొన్నారు.






## నిధులు లేక నీళ్లు అమ్ముకుంటున్న గ్రామపంచాయతీ గ్రామ కార్యదర్శి

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలంలో ప్రభుత్వ ట్రాక్టర్‌తో ప్రైవేటు వ్యక్తులకు నీళ్లు అమ్ముకుంటూ ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేస్తున్న సంఘటన అరూరు గ్రామపంచాయతీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గ్రామపంచాయతీ కార్యదర్శి పై అధికారులకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా అరూర్ గ్రామానికి చెందిన ప్రైవేటు వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్ ద్వారా నీళ్లను అమ్ముకుంటున్నాడు. విషయంపై గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్‌ను వివరణ కోరగా మాకు నిధులు లేకపోవడంతో నీటిని అమ్ముకుంటున్నామని అడగడానికి మీరు ఎవరని దురుసుగా సమాధానం ఇచ్చాడు. ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రైవేటు వ్యక్తులకు నీళ్లు అమ్ముతున్న గ్రామపంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## నీట్‌లో లోటల్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని హైస్కూల్‌లో పదవ తరగతి విద్యనభ్యసించిన వెంపటి సాయిసహాస్ర అనే విద్యార్థిని నీట్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి 1711వ ర్యాంక్ సాధించి మెడిసిన్ సీటు దక్కించుకోవడం అభినందనీయమని పాఠశాల ఛైర్మన్ బి.వరప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో సాయిసహాస్రను అభినందించి శాలువాతో సన్మానించి



మాట్లాడుతూ సాయిసహాస్ర ఇంటర్ తరువాత నీట్ పరీక్షను రాసి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి ఉత్తమ ర్యాంకు సాధించి మెడిసిన్‌లో సీటు సాధించిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి వెంకన్న, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్, నాగుల్‌మీరా, వెంకన్న, అజీముద్దిన్, సురేష్, శ్రీనివాస్, జావెద్, లతీఫ్, సతీష్, సరిత, కావ్య, సతీష్, పీఈటీలు ఉన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగురవేయాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ శ్రేణుల సన్నాహక సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రతి ఒక్కరూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో ప్రజలకు 6 గ్యారంటీలతో కూడిన బాకీ కార్డులను పంపిణీ చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కావాలంటే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో ఎంపిటిసి, జడ్‌పిటిసి, సర్పంచ్‌లుగా గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుజ్జ యుగందర్ రావు, మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములు గౌడ్, గోపాల్‌రెడ్డి, దొంగరి శ్రీనివాస్, మట్టపల్లి శ్రీశైలం, తునికి సాయిలు, దుర్గయ్య పాల్గొన్నారు.





## తహసీల్దార్ కార్యాలయానికి ప్రింటర్ బహుకరణ

**ప్రజాపక్షం/మునగాల:** మునగాల గ్రామానికి చెందిన దేవినేని సీతరామయ్య పెద్ద కుమారుడు దేవినేని నలంద శ్రీనివాస్ రిటైర్డ్ అర్మి ఎయిర్‌ఫోర్స్ అధికారి తహసిల్దార్ కార్యాలయానికి రూ.22వేల రూపాయల ప్రింటర్‌ను తహసిల్దార్ సరితకు అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సరిత మాట్లాడుతూ దాతల సహకారంతోనే ఏదైనా సాధ్యమవుతుందని అన్నారు. కార్యాలయ అవసరాల నిమిత్తం ప్రింటర్‌ను అందజేయడం సంతోషమన్నారు. ప్రింటర్‌ను అందజేసిన దేవినేని సీతరామయ్య కుటుంబ సభ్యులను ఆమె అభినందించారు. డిప్యూటి తహసిల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ రామారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బిసిలను మోసం చేసేందుకు 42శాతం రిజర్వేషన్ల డ్రామా

**ప్రజాపక్షం/మునగాల:** బిసిలను మోసం చేయడానికి 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డ్రామా ఆడిందని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఉడుం కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక పార్టీ కార్యాలయం నందు ఆయన మాట్లాడుతూ 22 నెలల రేవంత్‌రెడ్డి పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో ప్రజలను తప్పుదొవ పట్టిస్తూ కాలం వెల్లదీశాడని, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా గ్రామీణ ప్రాంతాలలో పాలన పడావుపెట్టి, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని గొప్పగా మాయమాటలు చెబుతూ కాలం వెళ్లదీసి నేడు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు నందు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆడిన స్థానిక సంస్థల ఎన్నికల డ్రామా రాష్ట్రంలోని బిసిలకు, ప్రజలకు ఓటర్లకు అర్థం అయ్యిందని అన్నారు.

## పొన్నగంటి కృష్ణయ్య జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/డిండి:** బిఆర్ఎస్ డిండి మండల నాయకులు, తవకలాపూర్ మాజీ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య జన్మదిన వేడుకలు గురువారం దేవరకొండ పట్టణంలో జరిగాయి. ఈ వేడుకల్లో జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, దేవరకొండ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని కృష్ణయ్యకు శాలువా కప్పి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఆయనతో పాటు బిఆర్ఎస్ ముఖ్య నాయకులు కేతావత్ బిల్యానాయక్,వడ్త్యా రమేష్ నాయక్,నేనావత్ కిషన్ నాయక్,డిండి మండల పార్టీ అధ్యక్షులు రాజినేని వెంకటేశ్వర్ రావు లు శుభాకాంక్షలు తెలిపారు.



## వరిధాన్యం కొనుగోలుపై ఒక్కరోజు శిక్షణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వానకాలం 2025 /26 సీజన్లో డిఆర్‌డిఏ(సెర్ప్) వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించబోయే సిబ్బందికి జిల్లా మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా డిఆర్‌డిఏ వై శేఖర్ రెడి మాట్లాడుతూ వానకాలం కాబట్టి అకస్మాత్తుగా వర్షాలు పడే అవకాశం ఉంటుంది కావున వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఎతైన ప్రదేశంలో ఏర్పాటు చెయ్యాలన్నారు.రైతులు పిపిసి లో ధాన్యం పోసినవెంటనే వారి పేరు సీరియల్ బుక్ లో రిజిస్టర్ చేసి వారికి సీరియల్ నెంబర్ ఇచ్చి ప్రకారం తేమశాతం రాగానే తూకం వెయ్యాలి. రైతులవద్ద నుంచి పట్టాదారు పాస్ బుక్ జీరాక్స్,ఆధార్ కార్డ్ జీరాక్స్ వాడుకలో ఉన్న రైతు బ్యాంకు పాస్ బుక్ జీరాక్స్ కాఫీలు తీసుకోవాలి. గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది,రైతుల సంక్షేమం కొరకు మహిళా సంఘాలచేత ఏర్పాటు చేయడం జరిగింది రైతులందరు మన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం అమ్మి ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధర గ్రేడ్ ''ఏ'' రూ.,లు 2389,కామన్ గ్రేడ్ రూ.లు 2369 సన్నధాన్యానికి అదనంగా రూ,500 ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు వరి ధాన్యాన్ని ప్యాడి కినర్ ద్వారా తూర్పార పట్టుకొని తాలు,మట్టిపెడ్డలు లేని ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రంకు తీసుకురావాలన్నారు.శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్‌డిఓ శ్రవణ్ కుమార్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి, వీరయ్య,బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## యువత కొత్త ఆలోచనలు చేయండి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** యువత కొత్త ఆలోచనలు చేయాలని భవితరాలకు మార్గాన్ని వేయండని Young India young leadership (ONE STOP SOLUTION FOR YOUTH) ఎన్జీవో ఆర్గనైజేషన్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ చావా రాజ్ కుమార్ అన్నారు. Young India young leadership 11వ సమావేశం నవ నవ భారత్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ చావా రాజ్ కుమార్ మాట్లాడుతూ Lead Today change Tomorrow అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న సంస్థ అన్నారు. మీ ఆలోచనలు సకారం చేసే ఇది ఒక చర్చవేదిక young India young leadership కొత్త కొత్తగా ఆలోచించండి కొత్త ఆవిష్కరణ సృష్టించండని తెలిపారు. మీ ఆశయానికి మేము దిక్సూచి అవుతాం అని అన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధగాని మహేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ యువత నవ కల్పన లు సృష్టించండి నవ భారతాన్ని నిర్మించండి అని పేర్కొన్నారు. ఈ కార్యక్ర



మానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నవభారత్ కళాశాల ప్రిన్సిపల్ చిక్క ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ మీరు ఆలోచించండి మీ అభివృద్ధి దేశ అభివృద్ధి గా చాటండి అని అన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ అంభోజు మల్లేశం జాయింట్ సెక్రెటరీ యేంపాల కొండల్ రెడ్డి సార్ ట్రెజరీ వెంకట్ రాజు గౌడ్ సార్, జాయింట్ డైరెక్టర్ శ్రవణ్ కుమార్ గాజుల వెంకటేష్ గౌడ్, శ్రవణ్ రెడ్డి, సంపత్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోషణమాసంపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యరగండ్లపల్లి విద్యార్థులతో గురువారం పోషకాహారం గురించి అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి వివరించినాము. అన్ని పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని తెలియజేసినాము. అదేవిధంగా పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి పరిసరాల పరిశుభ్రత గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు జి. వాసుదేవరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ యశోద, అంగన్వాడి టీచర్ రజిత, మరియు పాఠశాల ఉపాధ్యాయ స్టాఫ్ అందరూ, విద్యార్థులు పాల్గొన్నారు.



## రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 14, 15 తేదీల్లో జరిగే తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఐదవ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, పట్టణ కన్వీనర్ తిరుపతి రామ్మూర్తిలు కోరారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలు రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్‌లో జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్. వెంకన్న, మోహన్, వీరయ్య, లక్ష్మి నారాయణ, మాజీ కౌన్సిలర్ బావండ్ల పాండు, నాయకులు పాపిరెడ్డి, బాషా, బంటు రామారావు తదితరులు పాల్గొన్నారు.





## ఆరు గ్యారెంటీల లాగే, కాంగ్రెస్ 42శాతం బిసి రిజర్వేషన్ల డ్రామా

**ప్రజాపక్షం/దేవరకొండ:** 55 ఏళ్లు కేంద్రంలో అధికారంలో ఉండి ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పాటు పడిందా.. చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ జాతీయ నాయకులతో ఢిల్లీ వేదికగా కోట్లాడి మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు అని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు,మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు.గురువారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ 55 ఏళ్లు కేంద్రంలో అధికారంలో ఉండి కాంగ్రెస్ ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం పాటు పడిందా అని ఆయన అన్నారు.చిత్తశుద్ధి ఉంటే మీ కాంగ్రెస్ జాతీయ నాయకులతో ఢిల్లీ వేదికగా కోట్లాడమని చెప్పండని అన్నారు.మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ది పొందాలని చేసిన కుట్రలు పటాపంచలు అయ్యాయని అన్నారు.22 నెలలుగా బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడాల్సిన రేవంత్ గల్లీలో కొట్లాడుతున్నట్లు డ్రామా క్రియేట్ చేసారు తప్ప, బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించడం పట్ల ఏనాడూ చిత్తశుద్ధి ప్రదర్శించలేదని ఆయన ఆరోపించారు..

## కాంగ్రెస్ ఆడిన డ్రామాలో బలి పశువులైన బిసిలు

**ప్రజాపక్షం/దేవరకొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం ఆడిన బీసీ రిజర్వేషన్ల డ్రామాలో బీసీ సమాజాన్ని బలి పశువులను చేసిందని బీజేపీ దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ ఎటి. కృష్ణ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ,జడ్పీటీసీ,వార్డ్ మెంబర్,సర్పంచ్ ఎన్నికలపై హై కోర్ట్ స్టే విధించడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతారహితంగా ఎన్నికలను వాయిదా వేసే విధంగా తొందరపాటు చర్యలతో బీసీలను బలి పశువులను చేసి ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తూ తెలంగాణలో ఎన్నికలు నిర్వహించకుండా బీసీలకు42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం అనే సాకులు చూపిస్తూ దానికి కావలసిన ప్రణాళిక బద్ధంగా చట్ట సవరణ చేయకపోవడం తద్వారా బీసీలను కించపరిచే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయమని అన్నారు.ప్రజలు కాంగ్రెస్ పార్టీ కుట్రలకు కార్రుకాల్చి వాత పెట్టాలని అన్నారు.

## బిసిల నోటి దగ్గరి ముద్దను గుంజుకోవడం సరైంది కాదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీ తీర్మాణం ఆధారంగా జీవోను విడుదల చేసిన తరువాత కూడా అగ్రకుల నాయకులు న్యాయస్థానంకు వెళ్లి బీసీల నోటి కాడి ముద్దను గుంజుకోవడం సరైందికాదని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. గురువారం ఆయన స్తానికంగా మాట్లాడుతూ తెలంగాణాలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లపై సరైన నిర్ణయం తీసుకోకపోతే తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. బీసీ సమాజం ఏకతాటిపైకి వచ్చి హక్కులను సాధించుకోవాలన్నారు. బీసీ సంఘాలు కుల సంఘాలు కలిసి పార్టీలకతీతంగా పోరాడితే తప్పా 42శాతం రిజర్వేషన్ల హక్కును సాదించుకోలేమన్నారు. బీసీ సమాజం మొత్తం మరోసారి రోడ్లపైకి వచ్చే సమయం ఆసన్నమైందన్నారు.

## సాముహిక శ్రీమంతాలు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని వాసాలమర్రి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గురువారం గర్భిణీలకు సాముహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ స్వరాజ్యం మాట్లాడుతూ గర్భవతులు తీసుకోవలసిన ఆహారం జాగ్రత్తల గురించి వివరించారు. పుట్టిన పిల్లలకు ముర్రుపాలు చాలా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జ్యోతి, మున్నిసా అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

# విప్లవాన్ని యువతకు పరిచయం చేసిన వీరుడు చె గువేరా



**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : విప్లవాన్ని యువతకు పరిచయం చేసిన వీరుడు చేకువేరా అని, ఆయనను యువత ఆదర్శంగా తీసుకుని విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో చేగువేర 58వ వర్థంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం అజిత్ మాట్లాడుతూ చేగువేరా జీవించినంత కాలం వర్గదోపిడీకి నుండి ప్రజలను విముక్తి చేయాలని అనునిత్యం పోరాటాలు చేశారని చెప్పారు. చిన్న నాటి నుండి విప్లవ భావాలు గల కుటుంబంలో పెరిగిన ఆయనకు విప్లవ పోరాటం సహజ సిద్ధంగా అబ్బిందని చెప్పారు. శ్రామిక దోపిడీ పట్ల చైతన్య వంతమైన నాయకులుగా యువకులు సమాజాన్ని అధ్యయనం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, జిల్లా సమితి సభ్యులు రాజ్ కమల్, కళ్యాణి, వనిత, పూజిత, సింధు, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి జిల్లా స్థాయి సమావేశంలో రగడ

**- అధ్యక్షుడి ఒంటెద్దు పోకడ**
**- ప్రాతినిధ్యం లేని సీనియర్‌లు**
**- భగ్గుమన్న వర్గ విభేదాలు**



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచలో జరిగిన భారతీయ జనతా పార్టీ జిల్లా స్థాయి సమావేశం రసాభాసాగా సాగింది. గత కొంత కాలంగా రగులుతున్న అంతర్గ విభేదాలు భగ్గుమన్నాయి. జిల్లా అధ్యక్షుడి ఒంటెద్దు పోకడలకు నిరసనగా సీనియర్ నాయకులు తమ అసంతృప్తిని వెల్లగక్కారు. ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. పాల్వంచలో గురువారం బిజెపి జిల్లా స్థాయి స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడి అనుచర వర్గానికి మాత్రమే ముందస్తు సమాచారం ఇచ్చి సీనియర్ నాయకులకు కావాలనే దూరం పెడుతూ ఆహ్వానం పంపలేదంటూ వారు తమ అసంతృప్తిని వెల్లగక్కారు. అధ్యక్షులు ఉద్దేశ్యపూర్వకంగానే సీనియర్ నాయకులు విస్మరిస్తున్నారని పలువురు ఆరోపించారు. బిజేపి విస్తరణకు కాకుండా తన వర్గ ప్రాబల్యం కోసం పాకులాడుతున్నారని, పార్టీ అభివృద్ధికి గొడ్డలి పెట్టులా అధ్యక్షులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీనియర్ నాయకులు సీతారాం నాయక్ తో పాటుగా ఇతర సీనియర్ నాయకులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవటం మంచిది కాదంటూ హితవు పలికారు. ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించడాన్ని సీతారాం నాయక్ వర్గానికి చెందిన నాయకులు అడ్డుకోవడానికి శతవిధాలుగా ప్రయత్నించారు. ఇరు వర్గాల నడుమ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొంది. తోపులాటలకు దారి తీసింది. అదుపు తప్పి ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనితో స్పందించిన మాజీ జిల్లా అధ్యక్షులు రంగా కిరణ్ సమయ స్ఫూర్తిని ప్రదర్శించారు. ఇరు వర్గాలను శాంతింపజేయటానికి శత విధాలుగా ప్రయత్నించారు. అయినా యుద్ధ వాతావరణం తగ్గలేదు. ఎంతకూ పరిస్థితి అదుపులోకి రాకపోవటంతో జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమావేశం మధ్యలోనే బయటకు వెళ్ళిపోయారు. అనంతరం అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వ్యవహార శైలిపై సీతారాం నాయక్ వర్గీయులు తమ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆయన ఒంటెద్దు పోకడలతో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. జరగబోయే జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో తన వర్గానికే టికెట్లు ఇవ్వాలనుకుంటున్న ప్రభాకర్‌రెడ్డి ఆటలు సాగనివ్వబోమన్నారు. సమావేశం ఆద్యంతం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఒంటెద్దు పోకడలపైనే పలువురు నాయకులు తమ వాగ్బాణాలను సంధించారు. త్వరలోనే పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి యువతకు ఆదర్శం చె గువేరా



ప్రజాపక్షం/కారేపల్లి: ప్రపంచ యూత్ ఐకాన్‌గా, ప్రజా సమస్యలపై పోరాడుతూ యువత ఎదుర్కొనే సమస్యలకు పోరాటమే మార్గమని జీవితాంతం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణం అర్పించిన విప్లవ వీరుడు నిత్య స్ఫూర్తి ప్రదాత చేగువేరా అని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ కొనియాడారు. గురువారం డివైఎఫ్ఐ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో చేగువేరా 59వ వర్ధంతిని కారేపల్లిలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ యూత్ ఐకాన్ యంగ్ డైనమిగ్ లీడర్, ప్రవహించే ఉత్తేజం భయపడటం ఎప్పుడైతే మానేస్తామో అప్పుడే మన జీవితం మొదలైనట్లు అని, ఒకరి కాలికింద బానిసలా బ్రతికే బదులు లేచి నిలబడి ప్రాణం వదిలేయడం మేలు, ప్రపంచంలో ఎప్పుడు, ఎవరికీ అన్యాయం జరిగిన స్పందించడానికి సిద్ధంగా ఉండు అన్న చే మాటల కట్టుబడి చే గువేరా స్ఫూర్తితో ముందుకు నడవమే నేటి యువత సమాజంలో ఎదుర్కొంటున్న నిరుద్యోగం, యువతపై ప్రభావం చూపుతున్న విష సంస్కృతి, ఉపాధికై ఉద్యమించాలని యువతకు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా జస్టిస్ బిఆర్ గవాయ్ పై జరిగిన దాడి భారత రాజ్యాంగంపై ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిలా భావించాలని ఖండించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో గద్దం దిలీప్ కుమార్, ఎర్నాగి సంపత్, ఎస్‌కే సలీం, చిలుముల కమలాకర్, ఆదెర్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# బిసిలకు మళ్లీ అన్యాయమే!



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌పై హైకోర్టు స్టే విధించడంతో బిసి కులస్తులకు మళ్లీ అన్యాయమే జరిగిందని దీనికి రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని బిసి సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ తెలిపారు. గురువారం ఖమ్మం ఆర్‌జెసి కళాశాలలో ఏర్పాటు చేసిన బిసి కుల సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో గుండాల కృష్ణ మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఉభయ సభల్లో బిల్లు ఆమోదం పొందాక ఇలా జరగడం అగ్ర వర్గాల ఆధిపత్యాన్ని చూపుతుందన్నారు. జనాభా దామాషా ప్రకారం హక్కుగా రావాల్సిన రిజర్వేషన్లను అడ్డుకోవాలని హైకోర్టు, సుప్రీం కోర్టులలో కేసులు వేశారన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేంత వరకు పోరాడతామన్నారు. ప్రభుత్వం తక్షణమే బిసిలకు ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని లేని యెడల తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.ఈ సమావేశంలో బిసి సంఘాల నాయకులు కూరాకుల నాగభూషణం, బొమ్మ రాజేశ్వరరావు, కత్తి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో అశ్రద్ధ వద్దు

ప్రజాపక్షం/భద్రాచలం : ఐటిడిఏ పరిధిలోని వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించే విషయంలో సిబ్బంది అలసత్వం వహించరాదని గిరిజన సంక్షేమశాఖ ఇంచార్జ్ డిడి అశోక్ అన్నారు. గురువారం భద్రాచలం పట్టణంలోని పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంతో పాటు జిల్లాలోని 22 పిఎంహెచ్ హాస్టళ్లలో చదువుతున్న 3023 మంది విద్యార్థులకు వంటకు సంబంధించిన సామాగ్రితో పాటు ప్లేట్లు, గ్లాసులు, స్నాక్స్ తినే బౌల్స్ అందించినట్లు తెలిపారు. వంటలు చేసేందుకు ఐరన్ గ్యాస్ పొయ్యితో పాటు 16 కేజీల పప్పును ఉడికించే కుక్కర్‌ను సంబంధిత వార్డెన్లకు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఏటీడీఓ భారతీదేవి, వార్డెన్లు, డిడి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మతల్లి గుడి హుండీ లెక్కింపు



ప్రజాపక్షం/పాల్వంచ : మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్యన కొలువై ఉన్న (శ్రీకనకదుర్గ) పెద్దమ్మ తల్లి దేవాలయంలో గురువారం హుండీ లెక్కింపు చేశారు. 29.05.2025 నుండి 08.10.2025 వరకు అమ్మవారి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించారు. 133 రోజులకు గాను మొత్తం రూ. 41,02,731/లు మరియు విదేశీ నోట్లు 4, విదేశి నాణెములు 20, మిశ్రమ బంగారం 120 గ్రాములు, వెండి 2 కేజీల 600 గ్రాములు వచ్చింది. ఈ లెక్కింపులో దేవాదాయ ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి. భేల్‌సింగ్, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్. రజనీ కుమారి, ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు, కరూర్ వైశ్యా బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూసుమంచిలో మూడు నామినేషన్ల స్వీకరణ



ప్రజాపక్షం/కూసుమంచి: మండల కేంద్రంలో గురువారం లోకల్ బాడీ ఎలక్షన్‌లో భాగంగా 1 జెడ్‌పిటిసి, 2 ఎంపీటీసీ స్థానాలకు అధికారులు నామినేషన్లు స్వీకరించినట్లు తెలిపారు. జెడ్‌పిటిసి స్థానానికి పెనుబల్లి మండలానికి చెందిన శ్యామ్ లాల్ నామినేషన్ వేయగా ఎంపీటీసీ స్థానాలకు కూసుమంచి గ్రామం నుండి చెన్ను మౌనిక, చేగొమ్మ ఎంపీటీసీ స్థానానికి శ్రీహరి, నామినేషన్ అందినట్లు అధికారులు తెలిపారు. ఈ నామినేషన్లను రేపు కూడా స్వీకరించనున్నట్లు తెలిపారు.

# గైగోళ్ళపల్లి ఎంపిటిసి సిపిఐ అభ్యర్థిగా తేలు వెంకటలక్ష్మి



ప్రజాపక్షం/కూసుమంచి: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కూసుమంచి మండల ముఖ్య కార్యకర్తల అత్యవసర సమావేశం పార్టీ మండల కార్యదర్శి భూక్యా నరసింహ అధ్యక్షతన మండలంలోని గైగోళ్ళపల్లి గ్రామంలో గురువారం జరిగింది. ఈసమావేశంలో ఉమ్మడి గైగోళ్ళపల్లి గ్రామ ఎంపిటీసీ అభ్యర్థిగా తేలు వెంకటలక్ష్మి భర్త పిచ్చయ్యను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నామినేషన్ కార్యక్రమం శుక్రవారం ఉంటుందని పార్టీ నాయకులు తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గుండెపోంగు మల్లేష్, గ్రామ మండల నాయకులు పాల్గొన్నారు.

# ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాలాజీ



ప్రజాపక్షం/ఇల్లందు: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం ఇల్లందు ఏరియా బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గిరిజన సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సభ్యులు బానోత్ బాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా కేటిసి ఫిట్ సెక్రటరీగా మాలోత్ హరిసింగ్, ఫిట్ సహాయ కార్యదర్శిగా మనోజ్ కుమార్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల ఏఐటియూసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కే సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు దాసరి రాజారామ్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

# ముస్లిం కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ రవూఫ్



ప్రజాపక్షం/కల్లూరు: మండలం ముస్లిం కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ రవూఫ్ ఎంపికైనారు. గురువారం జరిగిన ముస్లిం త్రిసభ్య కమిటీ సమావేశంలో సభ్యులందరి ఆమోదంతో ఆయనను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ముస్లిం కమిటీ ఎన్నికల అధికారులు మున్నాఫ్, అమీరుద్దీన్, ఉస్మాన్లు ప్రకటించారు. ఈ మండల కమిటీ మూడు సంవత్సరాలు పాటు పనిచేస్తుందని ముస్లింలు ఆధ్యాత్మికంగా క్రమశిక్షణ పద్ధతిలో అభివృద్ధికి ఈ మండల కమిటీ కృషి చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు, ముస్లిం కమిటీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కమిటీగా ఎంపికైన అతనిని పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు అతనిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# పూలు అమ్మకందారులకు గుర్తింపుకార్డులు పంపిణీ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో వివిధ ప్రాంతాల్లో పూలు అమ్ముకునే వారికి ఖమ్మం టౌన్ ఫ్లవర్ మర్చంట్ యూనియన్ ఆధ్వర్యంలో ఫొటో గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్‌తో కూడిన గుర్తింపు కార్డులను గురువారం భక్తరామదాసు కళాక్షేత్రం ప్రాంతంలో జరిగిన కార్యక్రమంలో ఖమ్మం లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ ఓనపాకల రమేష్ చేతుల మీదుగా పూల అమ్మకందారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లేబర్ ఆఫీసర్ రమేష్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో పూల వ్యాపారులకు లేబర్ ఆఫీస్ నుంచి సహకారం అందిస్తామన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఫ్లవర్ మర్చంట్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మోహిన్, షేక్ ఖాజా మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ఖమ్మం నగరంలో వివిధ ప్రాంతాల్లో 300 మంది పూలు, పూలదండలు, బొక్కేలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. పేదవారే ఎక్కువగా పూలు అమ్ముకుంటున్నారని వారికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. యూనియన్ తరుపున పూల వ్యాపారులకు అండగా



ఉంటామని తెలిపారు. ఇండ్లు లేని పూల వ్యాపారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, బ్యాంకు రుణాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ సలహాదారులు షేక్ మసూద్, కార్యదర్శి ఆర్. పీటర్, కోశాధికారి శాబాష్ అహ్మద్, కన్వీనర్ షేక్ ముజాయిద్దీన్, షేక్ నాగులమీరా, వై.వినోద్, శేఖర్, షేక్ ఇసుబ్, కృష్ణవేణి, లాల్‌బి, జాన్‌బీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలి

**-జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పత్తి రైతులు భారత పత్తి సంస్థ (సిసిఐ) కేంద్రాల్లో పత్తి విక్రయానికి సంబంధించి కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని పత్తి విక్రయాలకు సంబంధించి స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న తేదీ, సమయానికి అనుగుణంగా సమీపంలోని సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి పత్తిని విక్రయించాలని తెలిపారు. సిసిఐ నిబంధనల మేరకు నాణ్యమైన పత్తిని తీసుకెళ్లి మద్దతు ధర క్వింటా రూ. 8,110 పొందాలన్నారు. అదేవిధంగా సిసిఐలో విక్రయించి కనీస మద్దతు ధర పొందెందుకు వ్యవసాయ శాఖ అధికారుల వద్ద పత్తి సాగుకు సంబంధించి వివరాలు నమోదు చేయడంతో పాటు ఖచ్చితంగా ఆధార్ నెంబర్ కలిగి ఉన్నట్లు రుజువు సమర్పించాలని ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది 2,25,613 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసిందని దానికి అనుగుణంగా 2,70,735 మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా ఉందన్నారు.

# మానవతారాయ్‌కి 'డాక్టరేట్'



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరుకు చెందిన మానవతారాయ్ కి ఉస్మానియా విశ్వవిద్యాలయం గురువారం డాక్టరేట్ ప్రకటించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ గవర్నర్ హైదరాబాద్ రాష్ట్ర మొట్టమొదటి చిట్టచివరి ముఖ్యమంత్రి డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు జీవితం సాహిత్యం అనే అంశంపై తెలుగు శాఖకు సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం గురువారం అతనికి డాక్టరేట్ ప్రకటించింది. ప్రస్తుత సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నిత్యానందరావు ఈ పరిశోధనకు మార్గదర్శకత్వం వహించారు. ఖమ్మం జిల్లా కల్లూరు కి చెందిన మానవతారాయ్ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఉస్మానియా కళాశాలలో ఎల్ఎల్బి పూర్తి చేసిన అతను హైకోర్టు న్యాయవాదుల సంఘంలో శాశ్వత సభ్యునిగా కొనసాగుతున్నారు. విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ గా పోరాటాలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో రెండుసార్లు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 10 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేసి పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. అతనికి డాక్టరేట్ లభించడం పట్ల న్యాయవాదులు, విద్యార్థిని, విద్యార్థులు, నిరుద్యోగులు, కాంగ్రెస్ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, మండల ప్రముఖులు హర్షిస్తూ అభినందన వ్యక్తం చేస్తున్నారు.

# బ్యాక్టీరియా బారిన వరి..!

**వాతావరణ మార్పులే కారణమంటున్న వ్యవసాయ అధికారులు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** చిరు పొట్ట దశకు వచ్చిన వరి పంటపై ఎండాకు తెగులు బ్యాక్టీరియా దాడి చేస్తుంది. మోతాదుకు మించి యూరియా వాడకం, తీవ్రమైన ఎండలు, అధిక వానలతో ఎండాకు తెగులు సోకే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. దీనిని నివారించే మందులు లేకపోగా...ఒక మొక్క నుంచి మరో మొక్కకు వ్యాపించకుండా యాంటీ బయోటిక్స్ రసాయనిక మందులు పిచికారీ చేయడమే మార్గమని సూచిస్తూన్నారు.

**28,218. ఎకరాల్లో సాగు**

ఖరీఫ్ సీజన్ లో మండల వ్యాప్తంగా 28,218 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పొలాలన్నీ చిరు పొట్ట దశకు చేరుకున్నాయి. విత్తనాలు బయటకు వచ్చే సమయంలో ఎండాకు తెగులు సోకడం తో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్క పై భాగంలో తెచ్చటి మచ్చలు ఏర్పడి ఆకులు పూర్తిగా ఎండిపోతున్నాయి. ఇది ఒక్కటి, రెండు మొక్కలతో మొదలై పొలమంతా వ్యాపిస్తుంది. తద్వారా దిగుబడి పై ప్రభావం పడుతుంది. అయితే ఇటివలే కురిసిన భారీ వర్షాలు, ఆ వెంటనే తీవ్రమైన ఎండలతో వాతావరణం నిలకడగా లేదు. దీనికి తోడు రైతులు పరిమితి కి మించి యూరియా చల్లారు. వాస్తవానికి ఎకరానికి మూడు దోసులు కలిపి రెండు నుంచి మూడు బస్తాలు సరిపోతుంది. కానీ రైతులు పొలం త్వరగా ఎదగాలనే ఉద్దేశంతో ఎకరానికి నాలుగైదు అంతకు మించి బస్తాల యూరియా వేశారు. దీంతో తెగుళ్ళు, చీడపీడలు సోకుతున్నాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. పంటకు సోకిన బ్యాక్టీరియా పూర్తిగా వ్యాపించకుండా రైతులు యాంటీ బయోటిక్స్ మందులను స్ప్రే చేస్తున్నారు.

**సూచించిన మందులే వాడాలి : ఎం.రాధ, వ్యవసాయ అధికారి**




ఎండాకు తెగులు వ్యాప్తి ని అరికట్టే యాంటీ బయా టిక్స్ రసాయనాలు అందుబాటులో ఉన్నాయి. అగ్రి మైసన్ లేదా ప్లాంటమైసిన్ కాప ర్ ఆక్సి క్లోరైడ్ పిచికారీ చేయాలి. సొంత నిర్ణయాలు తీసు కోవద్దు. స్థానిక వ్యవసాయాధికారులను రైతులు సంప్రదించాలి. పూత దశలో ఉన్నప్పుడు కాపర్ సంబంధిత శీలింధ్ర నాశినులు వాడొద్దు.

# మొక్కలు నాటారు.. రక్షణ మరిచారు..!

**-కాగితాల్లోనే లక్ష్యాలు.. కనిపించని మొక్కలు**
**-మొండేలుగా మారుతున్న మొక్కలు**






**ప్రజాపక్షం/కల్లూరుః** ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా భవిష్యత్తు తరతరాలకు మంచి ఆరోగ్యాన్ని అందించేందుకు పర్యావరణం రక్షించి ఆహ్లాదకరమైన వాతావరణ అందిస్తూ మంచి గాలిని అందించేందుకు అధిక మొత్తంలో నిధులు కేటాయించి ప్రభుత్వం ఆశయం గొప్పగా ఉన్న క్రింది స్థాయి అధికారులు పర్యవేక్షణ లోపం నిర్లక్ష్యంతో లక్ష్యం నీరు కారిపోతుంది. కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు, పెద్ద కోరుకొండి, వెన్నవల్లి, చిన్న కోరుకొండి పాయపూర్, ముచ్చవరం, పేరువంచ, బత్తులపల్లి, ముగ్గు వెంకటాపురం, లింగాల, ఎర్రబోయినపల్లి, తెలగవరం, మర్లపాడు తదితర గ్రామాలలో వన మహోత్సవ మొక్కలు రక్షణ లేక మొక్కలు పశువులకు ఆహారంగా మారాయి. పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ లోపంతో మొక్కలన్ని జీవాలకు ఆహారంగా మారి మొండం గా మారుతున్నాయి. మరికొన్ని ఆనవాలు లేకుండా పోతున్నాయి. ఈ విధంగా నాటడం నరకడం కొట్టేయడం బ్రతకలేదు చనిపోయిన వాటిల్లో కాగితాల్లో లెక్కలు చూపిస్తూ కాగితాల్లోనే లక్ష్యాలు చూపిస్తూ ప్రభుత్వాన్ని మోసం మాయం చేస్తున్నారు. నాటిన మొక్కల్లో సగం దక్కిన ప్రభుత్వ ఆశయం నెరవేరేది 202526 సంవత్సరానికి గాను గ్రామపంచాయతీలలో 47,000 మొక్కలు నాటక 15000 మొక్కలకు రక్షణ మాత్రమే కల్పించామని ఏపీవో హేమమాలిని తెలిపారు. మిగతావి రక్షించాల్సిన బాధ్యత ఎవరిది అంటూ ప్రజల ప్రశ్నిస్తున్నారు. రోడ్లు ఇరువైపులా ప్రధాన రహదారుల్లో ఇరువైపులా ప్రభుత్వ కార్యాలయాలలో మొక్కలను నాటి రక్షణ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత గ్రామపంచాయతీది ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక శ్రద్ధ వహించి మొక్కలను రక్షించే బాధ్యత కార్యదర్శి దే. ప్రతి సంవత్సరం ఈ విధంగా నాటడం కాగితాలలో లక్ష్యాలు చూపించడం జరుగుతుంది. ఈ నలభై ఏడు వేలు మొక్కల్లో సగమైన బతుకుతాయా అని ఒకరినొకరు చర్చించుకుంటున్నారు. ప్రతి సంవత్సరం సుమారుగా రెండులక్షల మొక్కలు నాటడం లెక్కల్లో చూపించడం తప్ప లక్ష్యాలు మాత్రం ఆకాశం లో కనిపిస్తున్నాయి. మరికొన్ని రెండు మూడు నెలల్లోనే గుంతలు పడి ఎండిపోతున్నాయి. నాటిన మొక్కలు సగానికి సగమైన బతకకుండా నిండిపోతున్నాయంటే పర్యవేక్షించే అధికారుల లోపమే అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రతి సంవత్సరం రెండు లక్షల పైగా నర్సరీలో పెంచిన మొక్కలు నాటిన కాగితాల్లో లక్ష్యాలు చూపించిన ఆశయానికి లక్ష్యాలకి పర్యవేక్షణ లోపంతో తూట్లు పడుతున్నాయి .దీంతో నిధులు కూడా వృధా అవుతున్నాయి .గత సంవత్సరాలుగా నాటిన మొక్కలు సగం బతికినట్లయితే ప్రభుత్వం లక్ష్యం నెరవేరేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. మొక్కలు రక్షణకు ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎంపీడీవో, ఏపీవో లు తెలిపారు.

# చేతి కొచ్చిన పంటలను నాశనం చేస్తున్న వానరాలు..!

**-కోతుల బాధ ఇంకెన్నాళ్లు....?**
**-నివారించాలంటున్న రైతులు**





**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల వ్యాప్తంగా చేతి కొచ్చిన పంటలను వానరాలు నాశనం చేస్తున్నాయి. అన్ని గ్రామాల్లో కోతుల బెడదతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అన్ని గ్రామాల్లో రోజు రోజుకు కోతుల సంఖ్య పెరుగుతూ, ఇండ్ల మీద, పంట పొలాల్లో వీర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇళ్ల తలుపు తీస్తే సరి ఇళ్లల్లో జొరబడి, ఇండ్లలో ఉన్న ఆహారాన్ని ఎత్తుకు ఎత్తున్నాయి. మనుషుల మీదిక తిరగబడుతూ కరుస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల మీద మూకుమ్మడిగా దాడి చేస్తూ వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయ, బొప్పాయి, పుచ్చకాయ, మునగ తోటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని రైతులు కనీళ్లు పెట్టుకుంటున్నారు. తాము పొలాల్లో ఏ పంటను వేసినా దిగుబడి దక్కకుండా కోతులు నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల కోతుల బెడద నుండి తప్పించుకోవడానికి దీపావళి బాంబులు, పేల్చడం, కుక్కలను, కొండ ముచ్చులను వదలడం, వివిధ రకాల చిత్రపటాలను ఏర్పాటు చేసినా ఇలా ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకుండా పోతుందని దిగాలు పడుతున్నారు. పొలాల చుట్టూ రోజు ఇద్దరు ముగ్గురు అరుసుకుంటూ గుళ్ళేరులతో రాళ్లు వేస్తూ వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. అకాల వర్షాల వల్ల పంటలు ఆగమైతే మరోపక్క కోతుల బాధల వలన పంటలు పండించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కోతులను పట్టించి దట్టమైన అడవిలో వదిలేలా చర్యలు చేపట్టి రైతులను, ప్రజలను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.